క్లుప్తంగా

వైభవంగా బోణాలు



అంకాళమ్మకు భోణాలు సమర్పిస్తున్న మహిళలు

బద్వేలు(అట్లూరు) : బద్వేలు మండలం అప్పరాజుపేట గ్రామంలో ఆదివారం అంకాళమ్మకు వైభవంగా భోణాల పండగ నిర్వహించారు. గ్రామ శివారున వెలసిన అంకాళమ్మకు ప్రతి ఏటా భోణాలు సమర్పించుకుంటే పాడి పంటలతో గ్రామం సుభిక్షంగా ఉంటుందని గ్రామస్తుల విశ్వాసం. ఆదివారం గ్రామ ప్రజలు అంతా భక్తిశ్రద్ధలతో భోణాలు సమర్పించుకున్నారు.

నేడు పల్లవోలులో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు: మండల పరిధిలోని పల్లవోలు గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి రాజేష్ కుమార్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వైద్య శిబిరం నిర్వహించి రోగులకు అవసరమైన మందులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పల్లవోలు గ్రామ ప్రజలు వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని వైద్యాధికారి కోరారు.

జములుబాషా మృతి తీరని లోటు

పోరుమామిళ్ల : ప్రముఖ కళాకారుడు, జనవిజ్ఞాన వేదిక కార్యకర్త జములుబాషా మృతి పోరుమామిళ్ల మండల వాసులకు తీరని లోటు అని రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదాపీర్, జన విజ్ఞానవేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు గఫార్, ఖాసింవల్లిలు తెలిపారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ అఫ్రిది అధ్యక్షతన జములుబాషాకు సంస్మరణ సభ నిర్వహించి మాట్లాడారు.

నేడు, రేపు దువ్వూరులో గడపగడపకు మన ప్రభుత్వం

దువ్వూరు : మండల కేంద్రమైన దువ్వూరు సచివాలయం–2 పరిధిలో సోమ, మంగళవారాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి ఆదివారం తెలిపారు. కార్యక్రమం ఉదయం 6.30గంటలకు ప్రారంభమవుతుందని, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తారన్నారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

సీఎంకు కృతజ్ఞతలు



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

పోరుమామిళ్ల : వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాలకు దూపదీప నైవేద్యం పథకం ద్వారా రూ.5 వేలు ప్రకటించడం హర్షణీయమని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంతాచారి, జిల్లా కార్పొరేషన్ డైరెక్టర్ బ్రహ్మశ్రీ గొడ్లవీటి సుబ్రమణ్యాచార్యులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, రాష్ట్ర దేవాదాయశాఖ కమిషనర్ ఎ.సి.శంకరబాలాజీలకు జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం వారు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

రామకోటి భక్తులకు సత్కారం



సత్కారం అందుకున్న రామకోటి భక్తులతో ఆవోపా నాయకులు

మైదుకూరు : పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం రామకోటి జపయజ్ఞంలో భాగంగా రామకోటి రాసిన 60 మంది భక్తులను ఆర్యవైశ్య అఫిషియల్స్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఆవోపా మైదుకూరు అధ్యక్షుడు దరిశా శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మైదుకూరు, బద్వేలు, ప్రొద్దుటూరు, వేంపల్లె, కడప ప్రాంతాలకు చెందిన 60 మంది రామకోటి రాసిన భక్తులను శాలువా, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆవోపా రాష్ట్ర చీఫ్ కోఆర్డినేటర్ మల్లిపెద్దు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు రమేష్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ వెంకటరామ్, రాష్ట్ర సహ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, బద్వేలు, ప్రొద్దుటూరుకు చెందిన ఆవోపా నాయకులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

కడప ఎడ్యుకేషన్ : కడప నాగరాజుపేటలోని మెడికేర్ హాస్పిటల్‌లో ఆదివారం డాక్టర్ మహబూబ్‌అలీ నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతం అయింది. ఈ వైద్య శిబిరంలో దాదాపు 200 మంది రోగులు పాల్గొని షుగర్, కొలెస్ట్రాల్, థైరాయిడ్ పరీక్షలను చేయించుకున్నారని అవసరం ఉన్న వారికి మందులను ఉచితంగా అందచేశామని డాక్టర్ మహబూబ్ ఆలీ తెలిపారు.

చిరకాల సమస్యకు చిటికెలో పరిష్కారం



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : స్థానిక 4వ మున్సిపల్ వార్డు పరిధిలోని సున్నపువారి వీధిలో ఉన్న చిరకాల సమస్యను ఆదివారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి స్పాట్‌లోనే పరిష్కరించారు. సున్నపు వారి వీధిలో రోజూ మురుగు కాలువ నిండి వీధిలోకి ప్రవహిస్తున్న కారణంగా దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎంతో కాలంగా ఈ సమస్యపై స్థానికులు ఫిర్యాదు చేసినా ఎవరూ పరిష్కరించలేదు. ఇది ఇలా ఉండగా శనివారం సాయంత్రం వార్డు ప్రజలు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని స్వయంగా కలిసి సమస్యను విన్నవించారు. ఆదివారం ఉదయం 7 గంటలకే ఎమ్మెల్యే వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డితో కలసి వీధిలో పర్యటించారు. స్థానిక మహిళలతో సమస్య గురించి ఆరా తీశారు. డ్రైనేజి కాలువ నిర్మాణం మున్సిపాలిటీ సరిహద్దులో ఉండటంతో గోపవరం గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ రాఘవేంద్రారెడ్డిని ఎమ్మెల్యే పిలిపించి మాట్లాడారు.

గత పాలకుల నిర్లక్ష్యం వల్లే ఈ సమస్య

గత పాలకుల నిర్లక్ష్యంతోనే ఇలాంటి సమస్యలు వెలుగులోకి వస్తున్నాయని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ప్రజలకు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో సీఎం జగన్, నియోజకవర్గ స్థాయిలో తాను సమస్యల పరిష్కారానికి నడుం బిగించామన్నారు. సమస్య పరిష్కారం కోసం వెంటనే రూ.33 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మించేందుకు అంచనాలను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నుంచే ఇందుకు అవసరమైన పనులు ప్రారంభించాలని సూచించారు. పాతికేళ్ల ఎమ్మెల్యేగా ఉన్న వరదరాజులరెడ్డి హయాంలో ఇలాంటి సమస్యలను పరిష్కారం కాలేదని, ప్రస్తుత టీడీపీ నేతలు సమస్యల గురించి కనీసం తెలుసుకోవడం లేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రూ.500 కోట్లకుపైగా నిధులు మంజూరు చేయించి ఆర్టీసీ బస్టాండ్, పెన్నా హైలెవెల్ బ్రిడ్జి, కూరగాయల మార్కెట్, వైఎస్సార్ ఇంజనీరింగ్ కాలేజి నిర్మాణాలను ప్రారంభించినట్లు వివరించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, మున్సిపల్ ఇంజనీర్ సాయికృష్ణ, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగేశ్వరరెడ్డి, సచివాలయ కన్వీనర్లు లక్కిరెడ్డి సరస్వతి రమణారెడ్డి, గరిశ రాజేంద్ర ప్రసాద్, ఆరవేటి సుబ్బయ్య, హౌస్ బిల్డింగ్ సొసైటీ డైరెక్టర్ కేకే, పుల్లారెడ్డి, కందుల సూర్యనారాయణరెడ్డి, రామసుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల పంటలను సాగుచేయాలి



బ్రాహ్మణపల్లెలో సాగులో ఉన్న జొన్న పంట

గోపవరం : ఖరీఫ్ సీజన్ చిరుధాన్యాల పంటలు సాగు చేసుకునేందుకు అనువైనదని, ఆ దిశగా రైతులు దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ తెలిపారు. ప్రతి ఆర్బీకే పరిధిలో 10 ఎకరాలకు తగ్గకుండా చిరుధాన్యాల పంటలు సాగు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. రాగి, సజ్జ, జొన్న, పెసర తదితర పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించిందన్నారు. ఉన్న భూమిలో కొంత వరకైనా చిరుధాన్యాల పంటలు సాగు చేయాలన్నారు. అవసరమైన ఎరువులు ఆయా ఆర్బీకే కేంద్రాల్లో సిద్ధంగా ఉంచినట్లు ఆయన తెలిపారు. చిరుధాన్యాల పంటలకు అంతర్జాతీయంగా గుర్తింపు రావడమే కాక ఈ పంటల వలన మంచి పోషకాహారం లభిస్తుందన్నారు. మండలంలోని 6 రైతుభరోసా కేంద్రాల పరిధిలో ఈ ఖరీఫ్ సీజన్‌లో కనీసం 60 ఎకరాల్లో చిరుధాన్యాల పంటలు సాగు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన తెలిపారు. చిరుధాన్యాల పంటల సాగుపై జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా వ్యవసాయాధికారి పూర్తి స్థాయిలో దృష్టి సారించారని, వారి ఆదేశాల మేరకు రైతులకు అవగాహన కల్పించి పంటలు సాగు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఫోన్ నంబర్లు మార్పు

అట్లూరు : మండలంలోని కొండూరు, మాడపూరు, కమలకూరు విద్యుత్ సబ్‌స్టేషన్లలో ఉన్న పాత ఫోన్ నెంబర్లను తొలగించి కొత్త ఫోన్ నెంబర్లను కేటాయించినట్లు స్థానిక ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈ విజయ్‌కుమార్ ఆదివారం తెలిపారు. కొండూరు సబ్‌స్టేషన్‌లో కొత్తఫోన్ నెంబరు 8712625934. మాడపూరు సబ్‌స్టేషన్‌లో 8712625935. కమలకూరు సబ్‌స్టేషన్‌లో 8712625936 నెంబర్లను కేటాయించారన్నారు. అవసరమైన వారు ఈనెంబర్లకు కాల్ చేయాలన్నారు.

సచివాలయ ఉద్యోగికి షోకాజ్ నోటీసు

మైదుకూరు: మైదుకూరులోని మూడవ సచివాలయం పరిధిలో నేతన్న నేస్తం లబ్ధిదారులను లంచం డిమాండ్ చేసినట్టు ఆరోపణలు రావడంతో వార్డు వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్యదర్శి సుబ్బ శంకర్‌కు మున్సిపల్ అధికారులు ఆదివారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. స్థానిక చౌడేశ్వరి నగర్ కాలనీకి చెందిన పలువురిని డబ్బులు ఇవ్వందే నేతన్న నేస్తం లబ్ధి కోసం పెట్టుకున్న దరఖాస్తులను ఆన్‌లైన్లో నమోదు చేయనని వెల్ఫేర్ కార్యదర్శి శంకర్ చెప్పడంతో దరఖాస్తుదారులు నిలదీసినట్టు సామాజిక మాధ్యమాల్లో కథనాలు వచ్చాయి. దానిపై ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ పరమేశ్వర్ రెడ్డి నోటీసులు జారీ చేశారు. నోటీసు అందిన 24 గంటల్లో లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయండి



పోస్టర్లను విడుదల చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కలసపాడు : వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గురయ్య తెలిపారు. ఈనెల 29, 30, జూలై 1వ తేదీన బ్రహ్మంగారిమఠంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా ఆదివారం శిక్షణ తరగతులకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణకు పనిచేస్తుందన్నారు. అలాగే రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉపాధి కూలీలకు రూ.600 కూలీ ఇవ్వాలని, అన్యాక్రాంతమైన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని, అసైన్‌మెంట్ కమిటీ ద్వారా పేదలకు భూములు పంపిణీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు ఎస్.రత్నం, చిన్నయ్య, ఓబయ్య పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలపై పోరాటాలు చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేయాలని కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షులు చెప్పలి పుల్లయ్య పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఇందిరాభవన్‌లో పులివెందుల అసెంబ్లీ కాంగ్రెస్‌పార్టీ కార్మిక విభాగం నూతన కమిటీని నియమించి నియమాక పత్రాలను అందజేశారు. అధ్యక్షుడిగా నిఖిల్, ఉపాధ్యక్షులుగా రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా పుల్లయ్య, వెంగల్‌రెడ్డిని ఎన్నుకున్నారు.

భాగవతార్ యడవల్లి రమణయ్యకు సన్మానం



యడవల్లి రమణయ్యను సన్మానిస్తున్న చిప్పగిరి ప్రసాద్, డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆదివారం ప్రముఖ భాగవతార్ యడవల్లి రమణయ్యను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ ఇటీవల మనం ఫౌండేషన్ వారు ప్రముఖ భాగవతార్ యడవల్లి రమణయ్యకు గౌరవ డాక్టరేట్ ఇచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. ఆయన హరికథా గానాన్నే జీవిత పరమావధిగా ఎంచుకుని 40 ఏళ్లుగా దేశం నలుమూలలా హరికథా గానం చేస్తూ ఎన్నో సత్కారాలను పొందారన్నారు. టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు చిప్పగిరి ప్రసాద్, డాక్టర్ వరుణ్‌కుమార్ రెడ్డి, రచయిత జింకా సుబ్రహ్మణ్యం, నాటక కళాకారుడు కొడవలూరి చంద్రశేఖర్ రాజు, డాక్టర్ కూరపాటి శ్రీనివాసులురెడ్డి, సాయికుమార్, మురళి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ, ఫౌండేషన్ నిర్వాహకులు

బద్వేలు అర్బన్ : ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, అప్పుడే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ చంద్రహాసరెడ్డి తెలిపారు. ఆరోగ్యభారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నిరాశ్రయుల వసతి గృహంలో మంచి ఆరోగ్యం–తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. పోషక విలువలు కలిగిన ఆహారం, క్రమం తప్పని వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చని తెలిపారు. పరిశుభ్రత అనేది ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, వ్యాధుల వ్యాప్తిని నిరోధించడానికి సహాయపడేదనే విషయాన్ని ప్రతిఒక్కరు గ్రహించాలన్నారు. అనంతరం పండ్లు, బ్రెడ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్యభారత్ ఫౌండేషన్ అధ్యక్షుడు టి.రహీమ్, సంస్థ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల సంక్షేమానికి కృషి చేస్తాం



మాట్లాడుతున్న సైనిక సంక్షేమ కార్యాలయం అధికారి ఐజే రఘురామయ్య

ప్రొద్దుటూరు కల్చరల్ : మాజీ సైనికుల సంక్షేమానికి కృషి చేస్తామని కడప సైనిక సంక్షేమ కార్యాలయం అధికారి ఐజే రఘురామయ్య తెలిపారు. ఆదివారం ఎన్జీఓ హోంలో మాజీ సైనికుల సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు ఎన్.బాలవీరారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాజీ సైనికులు తమ సమస్యలను తెలపాలన్నారు. మాజీ సైనికులకు ప్రభుత్వం ద్వారా రావాల్సిన ప్రయోజనాలు ఏవైనా పెండింగ్‌లో ఉంటే తమ దృష్టికి తెస్తే ప్రభుత్వానికి తెలిపి పరిష్కరిస్తామన్నారు. 80 ఏళ్ల పైబడిన మాజీ సైనికులను ఘనంగా సత్కరించారు. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, ఎర్రగుంట్ల, మాజీ సైనికులు పాల్గొన్నారు.

ఘనంగా నారీ సశక్తీకరణ దినోత్సవం



జగదాంబ సరస్వతికి పూలు చల్లి నివాళి అర్పిస్తున్న ఓంశాంతీలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక విజయనగరం వీధిలోని ఓంశాంతి భవనంలో ఆదివారం నారీ సశక్తీకరణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఓంశాంతి భవనం నిర్వాహకురాలు, అమెరికా ప్రభుత్వ ఆర్మీలో ప్రముఖ మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ ప్రసూన, ఎస్‌ఆర్‌ఐ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నరసింహారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మమ్మా చిత్రపటానికి పూలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బీకే శాంత మాట్లాడుతూ బ్రహ్మకుమారీస్ సంస్థ తొలి అధ్యక్షురాలు జగదాంబ సరస్వతి(మమ్మా) 58వ పుణ్య స్మృతి దినాన్ని నారీ సశక్తీకరణ దినోత్సవంగా ప్రపంచ వ్యాప్తంగా 140 దేశాల్లోని 11,000 ఓంశాంతి సేవా కేంద్రాల్లో ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ స్వయం పరివర్తనతోనే విశ్వ పరివర్తన సాధ్యమన్న నాందితో మహిళలను మహాశక్తులుగా చైతన్య పరిచిన మమ్మాను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వారి బోధనలను, అనుకరణలను ఆచరించి ప్రతి స్త్రీ ఆత్మ సంస్కరణ గావించుకుని శక్తివంతంగా ఎదగాలన్నారు.

గోకుల్‌నగర్‌కు డ్రైనేజీ కాలువలు



డ్రైనేజి కాలువల నిర్మాణంపై చర్చిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డులో ఉన్న గోకుల్ నగర్‌లో త్వరలో డ్రైనేజి కాలువలు నిర్మిస్తామని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం గోకుల్ నగర్‌లోని పలు ప్రాంతాలను పరిశీలించారు. రూ.160 కోట్లతో పట్టణంలో డ్రైనేజి కాలువలను నిర్మించేందుకు ఇప్పటికే భూమి పూజ చేశామన్నారు. ఏక కాలంలో పట్టణమంతా పనులు మొదలు పెడితే ఇబ్బందిగా ఉంటుందని, ప్రస్తుతం గోకుల్ నగర్, గోపిరైస్ మిల్లు రోడ్డులో డ్రైనేజి కాలువలు నిర్మిస్తున్నామన్నారు. తర్వాత అన్ని ప్రాంతాల్లో పనులు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

బాల సాహిత్యంలో చదువులబాబు కృషి ప్రశంసనీయం



చదువుల బాబును సత్కరిస్తున్న కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : బాల సాహిత్యంలో డీకే చదువుల బాబు ఎనలేని సేవ చేశారని.. ఆయన కృషి ప్రశంసనీయమని కొనిరెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు కొనిరెడ్డి శివచంద్రారెడ్డి అన్నారు. స్థానిక కొర్రపాడు రోడ్డులోని కొనిరెడ్డి ఫౌండేషన్ కార్యాలయంలో ఆదివారం కేంద్రసాహిత్య అకాడమి అవార్డుకు ఎంపికైన డీకే చదువులబాబును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ చదువులబాబు నాలుగు దశాబ్దాలుగా బాలసాహిత్యంలో విశిష్ట సేవలందిస్తూ 700పైగా బాలల కథలు రచించారన్నారు. వేలాది మంది విద్యార్థుల హృదయాల్లో నైతిక విలువలను పెంపొందించడానికి, భావిభారత పౌరులుగా ఎదగడానికి తన కథల ద్వారా బీజం వేశారన్నారు. బాలల కథలే కాకుండా సమాజాన్ని సంస్కరించే కథలు రచించి సిరిపురి కీర్తిని ఢిల్లీ పీఠంపై ఆవిష్కరించారన్నారు. డాక్టర్ మూలె రామమునిరెడ్డి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ప్రభుకుమార్ మాట్లాడుతూ పండితుడుగా, సాహితీ ప్రియుడుగా చదువులబాబు చేస్తున్న సేవను కొనియాడారు. చదువులబాబును శాలువ కప్పి, పూలమాల వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రచయిత ఖలందర్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గజ్జల వెంకటేశ్వరరెడ్డి, సాహితీ అభిమానులు, కొనిరెడ్డి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ట్యాలీ కోర్సులో శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు 'బెంగళూరు'లో ట్యాలీ కోర్సులో శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని ఫౌండేషన్ అడ్మిషన్స్ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు టెన్త్, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ చదివి ఉండాలని పేర్కొన్నారు. వయస్సు 18 నుంచి 26 ఏళ్ల లోపు ఉండాలని తెలిపారు. ట్యాలీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లీషులో కూడా శిక్షణ ఇస్తారన్నారు. వివరాలకు 90004 87423 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

విద్యా, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి

యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా


కడప ఎడ్యుకేషన్: విద్య, ఉపాధ్యాయ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా కోరారు. ఆదివారం కడపలోని యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. జీఓ 117 అమలుతో ప్రభుత్వ ప్రాథమిక విద్యారంగ నిర్వీర్యం అయ్యిందన్నారు. ఉన్నత పాఠశాలల్లో 3,4 తరగతులను విలీనం చేయడం వల్ల ఉపాధ్యాయులకు బోధనకు, విద్యార్థుల సామర్థ్యాల మధ్య అంతరం ఏర్పడి సమతుల్యత దెబ్బతింటోందన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వరకు కొనసాగిస్తూనే 6 తరగతి నుంచి 10వ తరగతి ప్లస్ టు ఒకే చోట నిర్వహిస్తే విద్యార్థులు నాణ్యమైన విద్యను పొందుతారని పేర్కొన్నారు. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత ఉందన్నారు. విద్యారంగంలో పనిచేస్తున్న పీఆర్‌సీలు, కంప్యూటర్ ఆపరేటర్లు, కేజీబీవీల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి మినిమం టైం స్కేల్ పరిధిలోకి తేవాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్, జిల్లా సహాధ్యక్షులు రవికుమార్, సుజాతరాణి, జిల్లా కార్యదర్శి మస్తానయ్య, ఏజాస్ అహ్మద్ పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతులకు ఉద్యోగ అవకాశాలు

పెండ్లిమర్రి : పులివెందుల ఏరియా డెవలంప్‌మెంట్ ఏజెన్సీ వారి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతులకు శిక్షణతో నిమిత్తం లేకుండా ఆల్ డిక్సన్ టెక్నాలజీస్ కంపెనీలో ఉద్యోగాల కోసం సోమవారం పెండ్లిమర్రి వెలుగు కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వెలుగు ఏపీఎం వెంకటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆసక్తిగల యువతులు ఇంటర్వ్యూకు వచ్చేటప్పుడు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు తీసుకునిరావాలని ఆయన తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



గురువులతో 1986-87 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు

ప్రొద్దుటూరు : స్థానిక వసంతపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం ఘనంగా జరిగింది. 1986–87 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు హాజరై ఆ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను ఆహ్వానించి శాలువాలు, పూలమాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గడిచిన కాలంలో చనిపోయిన తమ మిత్రులకు సంతాపం తెలిపారు. ఆ కుటుంబాలకు వీలైన మేరకు సాయం చేయాలని నిర్ణయం తీసుకున్నారు. తాము చదువుతున్నప్పుడు ఉద్యోగంలో చేరిన విద్యావతి ప్రస్తుతం ఇదే పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేయడాన్ని అభినందించారు. నాటి నుంచి నేటి వరకు ఇదే పాఠశాలలో పనిస్తున్న అటెండర్ నిస్సార్ అహ్మద్‌ను సన్మానించారు.



అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

బద్వేలు అర్బన్ : మూడు దశబ్దాలకు పైబడిన అనుబంధం వారిది. ఎప్పుడో చిన్నప్పుడు కలిసి చదువుకుని వివిధ రంగాల్లో స్థిరపడిన స్నేహితులంతా కలుసుకుని తమ జ్ఞాపకాలను పంచుకోవాలనుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడిన మిత్రులంతా ఆదివారం కలుసుకుని చదువుకునే రోజుల్లో చేసిన అల్లరిని గుర్తు చేసుకుంటూ ఉత్సాహంగా, ఆనందంగా గడిపారు. స్థానిక ఎస్‌వీసీఎం పాలిటెక్నిక్ కళాశాలలో కళాశాలకు చెందిన 1981–84 సివిల్, మెకానికల్ బ్రాంచ్ పూర్వ విద్యార్థులు నిర్వహించిన పూర్వ విద్యార్థుల కలయిక కార్యక్రమంలో చిన్ననాటి స్నేహితులంతా కలుసుకుని ఉల్లాసంగా గడిపారు. అలాగే తమకు విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను సన్మానించుకున్నారు. కార్యక్రమంలో కార్యక్రమ నిర్వాహకులు సింగసాని విజయకుమార్ (బుజ్జి), ధర్మేంద్రకుమార్, ఫరూఖ్, సురేష్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, రామసుబ్బయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

26,27 తేదీల్లో పేరెంట్ కమిటీ సమావేశాన్ని నిర్వహించాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఈ నెల 26,27 తేదీల్లో పేరెంట్స్ కమిటీ సమావేశాలను నిర్వహించాలని సమగ్రశిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆధికారి మిట్టా కేశవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టే వివిధ విద్యా కార్యక్రమాలను ఈ సమావేశంలో పేరెంట్ కమిటీలకు వివరించాలని తెలిపారు. పిల్లలను ప్రతి రోజు పాఠశాలకు పంపేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. విద్యాకానుకను ఎలా ఉపయోగించాలో తెలియపరచాలని తెలిపారు.

విరాళం

కడప కార్పొరేషన్: చెన్నూరులోని అంజుమన్ జన్నతుల్ బాకీ బరియల్ గ్రౌండ్ డెవలప్‌మెంట్ మసీదు కమిటీకి వైఎస్సార్‌సీపీ నాయకులు షేక్ సుభాన్ బాషా రూ.50వేల విరాళం అందజేశారు. ఆదివారం నాగరాజుపేటలోని తన కార్యాలయంలో మసీదు కమిటీ సభ్యులకు ఇందుకు సంబంధించిన నగదును అందజేశారు. ఈ సందర్భంగా సుభాన్ బాష మాట్లాడుతూ మంచి కార్యక్రమం చేయడం సంతోషంగా ఉందని తెలిపారు.